# గౌతమి



**మ**ధ్యాహ్నం మూడు గంటలయింది. పిల్ల వాడికి పాలు పట్టి పడుకో బెట్టాను. అలవాటు ప్రకారం, పడక కుర్చీలో నడుం వాల్చాను. మాగన్నుగా నిద్రపట్టింది.

"ట్రింగ్! ట్రింగ్" కాలింగ్ బెల్ మ్రోగింది.

వేళ గాని వేళ ఎవరొచ్చా రబ్బా! అనుకుంటూ లేవాలని లేక పోయినా, లేచి వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా, బిడియపడుతూ, ఒక అమ్మాయి నిలబడి ఉంది.

"సారీ తాతగారూ! నిద్ర చెడగొట్టానా?" నవ్వుతూ అంది ఆ అమ్మాయి.

తేరి పార చూశాను. చక్కటి బొట్టు, కట్టు. కుందనపు బొమ్మలా చూడ ముచ్చటగా ఉంది. భుజాన వ్యానిటీ బ్యాగ్ వ్రేలాడుతోంది. ఎండను పడి వచ్చిందేమో, చెమటలు కక్కుతోంది.

"అమ్మాయి అందంగా ఉంది!" అనుకున్నాను మనసులో.

"మా కోడలు కాలేజీకి వెళ్లిందమ్మా! సాయం కాలం గాని రాదు." అన్నాను తేరుకుని.

"తెలుసండీ! నేను మేడమ్‌ని కలుసుకొని, కాలేజీ నుంచే వస్తున్నాను. నన్ను మీరు గుర్తు పట్టలేదను కుంటా! అప్పు డప్పుడు అనుమానాలు తీర్చుకోవడానికి వస్తూండే దాన్ని. క్రిందటి సంవత్సరమే డిగ్రీ పాసయాను."

"అలాగా" అన్నాను గుమ్మంలో నిలబడే.

"ఈ ప్రక్కనే ఉన్న పాఠశాలలో ఇంటర్వ్యూ కని వచ్చాను. మాది ఈ పక్కనే ఉన్న పల్లెటూరు లెండి. ఉదయాన్నే బయలు దేరి వచ్చాను. ఇప్పటి వరకు కాలేజీలో మేడమ్స్‌తో మాట్లాడుతూ కూర్చున్నాను. మీ కోడలుగారు 'మా ఇల్లు నీవు ఇంటర్వ్యూకి వెళ్లే స్కూలుకి దగ్గరే కదా! మా మామగారు ఇంట్లోనే ఉంటారు. కాస్త ముఖం కడుక్కొని, ఫ్రెష్‌గా ఇంటర్వ్యూకి వెళ్లమని సలహా ఇచ్చారు. మేడమ్ సలహా మేరకు వచ్చి మిమ్మల్ని శ్రమపెడుతున్నాను!" అంది వినయంగా.

ఆ అమ్మాయి మాట తీరు ముచ్చటగా, వినసొంపుగా ఉంది.

"అలాగా? దానిదేం భాగ్యం తల్లీ! లోపలికి రా! స్నానాలగదిలో సబ్బు అదీ ఉంటుంది. ఛక్కగా వెళ్లి ముఖం కడుక్కో" అప్పటి వరకు ఆ

ఏ.వి. సుబ్బలక్ష్మి

అమ్మాయిని బయటే నిలబెట్టి నందుకు కొంచెం నొచ్చుకున్నాను.

అమ్మాయి లోపలికి వచ్చింది. స్నానాల గదిలోకి వెళ్లి ముఖం కడుక్కొని, తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ బయటకు వచ్చింది.

"చూడమ్మా! పడక గదిలో అద్దం ఉంది. పౌడరు, తిలకం వగైరాలన్నీ అక్కడే ఉన్నాయి. మొహమాట పడకు" అంటూ సోఫాలో కూలబడ్డాను.

క్షణంలో పౌడరు రాసుకుని, బొట్టు పెట్టుకుంది. చిటికెలో జడవేసుకుంది. ఒత్తుగా, నల్లగా ఉన్న ఆ తెగ బారెడు కురుల్ని ఆసక్తిగా చూచిన నాకు ఆడపిల్లకు తలకట్టు ఎంత అందం అనిపించింది.

ఇంతలో "తాతగారూ! కాస్త చీర సర్దుకోవాలి!" అంది సంకోచంగా.

"మార్చుకో అమ్మా!" అంటూ పడకగది తలుపు దగ్గరగా వేశాను.

"కాస్త టీ ఇస్తాను. తాగి వెళ్లమ్మా. ఫ్రెష్‌గా ఉంటుంది." అప్పటి వరకు నేను కూడా టీ త్రాగలేదన్న విషయం గుర్తుకు వచ్చి, వంటగదిలోకి దారి తీశాను.

"వద్దండీ! ఇలా చుట్టంలా వచ్చినందుకే సిగ్గుగా ఉంది. ఇంకా టీ కోసం కూడా మిమ్మల్ని శ్రమ పెట్టాలా?" జవాబుగా అంది పడకగదిలోంచి.

"ఫరవాలేదులే అమ్మా!" అంటూ టీ కలిపే సందడిలో మునిగి పోయాను.

రెండు కప్పుల్లో టీ పడబోసి తీసుకు వచ్చేలోపులో పువ్వులా చీర సర్దుకుని, తలుపు తీసి బయటకు వచ్చింది.

ఒక కప్పు ఆ అమ్మాయి చేతిలో పెడ్తూ "నీ పేరేమిటమ్మా?" అనడిగాను.

"అయ్యో! నా పేరు చెప్పనే లేదు కదూ! సారీ తాతగారూ! నా పేరు గౌతమి!" అంది ఎంతో నొచ్చుకుంటూ.

"మీ నాన్నగారేం చేస్తారమ్మా?" వివరాలడిగాను.

"వ్యవసాయ మండీ!"...క్లుప్తంగా చెప్పింది.

టీ త్రాగి, వద్దన్నా వినకుండా రెండు కప్పులూ కడిగి బోర్లించింది.

చక చక ఆ పిల్ల అలా పనులు చేస్తుంటే "చురుకైన పిల్ల!" అనుకున్నాను.

"వస్తానండీ! చాలా థ్యాంక్సండీ! మేడమ్ రాగానే నేను వచ్చానని చెపపండీ!"

"ఫరవాలేదులే తల్లీ! దానిదేముంది!" అన్నాను.

"ఇంటర్వ్యూకి టైమయిందండీ! వస్తాను!" అంటూ చురుగ్గా లేచి వెళ్లిపోయింది.

తలుపేసుకున్నాను. పిల్లాడు లేచి ఏడుస్తున్నాడు. బట్టలు తడిపాడు. వాడి పనిలో నిమగ్నమై పోయాను.

సాయంకాల మయింది. వరుసగా పని మనిషి, పాలవాడు, ఆపైన మా అబ్బాయి, కోడలు, ఒక్కొరొక్కరే దిగారు. స్నానం చేసి మామూలుగా జపం చేసుకుంటున్నాను.

ఇంతలో మా కోడలు గాభరాగా పూజ గదిలోకి దూసుకు వచ్చింది. "మామయ్యగారూ! మీరేమైనా పెద్ద బీరువా తీశారా?" కంగారుగా అడిగింది.

సామాన్యంగా నేను జపం చేసుకుంటూండగా ఎవరూ డిస్టర్బ్ చెయ్యరు. అందులో మా కోడలు కంగారు చూసి నాకు చిరాకు పుట్టింది.

"నేను మీ బీరువా ఎందుకు ముట్టుకుంటానమ్మా?". ఏదో అడగరాని విషయం నన్ను అడిగినట్లుగా అనిపించింది నాకు.

"ఏమండీ! మీ రేమైనా తీశారా?" అరచినట్లుగా అంది మావాడితో.

"నే నెందుకు తీస్తానే? ఎప్పుడూ లేనిది. మతి పోయిన దానిలా ఏమి టా అరువులు?" విసుక్కున్నాడు మా వాడు.

మా కోడలు కంగారు చూచి నాకూ కంగారు పుట్టింది.

"అమ్మో! కొంపలు మునిగాయండీ! 'మొన్న కొనుక్కున్న పట్టుచీర లేదండీ. బీరువా సేఫ్ తెరిచి ఉంది. క్రొత్తగా చేయించుకున్న చెక్కుడు గాజులు కనిపించడం లేదండీ! పిల్లాడి మురుగులు కూడా మాయమయ్యాయి. అయ్యయ్యో! ఎల్.ఐ.సి. కి కట్టాల్సిన డబ్బు కూడా లేదండీ!" అంటూ బీరువా ఎదురుగా కుప్పకూలి పోయింది మా కోడలు లక్ష్మి.

పని మనిషితో సహా అందరం పడకగదిలోకి పరుగు పెట్టాం.

"బీరువా తాళాలు తలగడా క్రిందే ఉన్నాయి కదా!" అంటున్నాడు మా వాడు.

"ఏమోనండీ! నేను చూసే సరికి బీరువా తలుపు దగ్గరగా వేసి ఉంది. ఎవరో తెలిసిన వాళ్లపనే!" అంటూ పలపలా ఏడుస్తోంది మా కోడలు.

"పాపం! ఈ మధ్యనే ముచ్చట పడి చెక్కుడు గాజులు చేయించుకుంది. ఎంతైనా ఆడ పిల్ల కదా!" అనిపించింది.

"అమ్మో! ఎవరో చాలా తెలివిగా బీరువాలో వస్తువుల్ని సంగ్రహించారండీ!" ముక్కు చీదుతూనే బిగ్గరగా అంది లక్ష్మి.

"అంటే!" నోట మాటరాక నసుగుతున్నాను.

అందరూ ఒక్క సారే ప్రశ్నార్థకంగా నా వైపు చూశారు.

"మధ్యాహ్నం నీవు పంపావని గౌతమి అనే అమ్మాయి వచ్చి బట్టలు మార్చుకుని వెళ్లిందమ్మా లక్ష్మి! నీవు ఆ పిల్లని పంపలేదా?" ఆశ్చర్య పోతూ ప్రశ్నించాను.

"గౌతమా? ఆ పేరు గల పిల్ల మా కాలేజీలోనే లేదు మామయ్యగారూ! నే నెవర్నీ మన ఇంటికి పంపలేదండీ!" వెక్కిళ్ల మధ్యలోనే మా కోడలు జవాబిచ్చింది.

"అంటే ఆ పిల్ల న న్నెంత మోసం చేసింది? చీర సర్దుకుంటానని, చిటికలో, బీరువాలో వస్తువులు సంగ్రహించిందన్నమాట! టీ కలిపే 'సందడిలో, నా చెవులు మూసుకు పోయాయి. నేర్పుగా నిలువుదోపిడి జరిగి పోయింది. భగవంతుడా! ఎవరిని నమ్మాలో తెలియని రోజులు వచ్చి పడ్డాయ్!

"పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఎస్.ఐ.గా పని చేస్తున్నప్పుడు, ఎంతో నేర్పుగా ఎంతో మంది దొంగల్ని పట్టుకున్నాను. ఎన్నో దొంగతనాల చిక్కుముడుల్ని విప్పాను. డిపార్టుమెంటులో ఎంతో మంచి పేరు తెచ్చు కోవటంతో పాటు, నా నేర్పుకి, సేవకు గుర్తింపుగా స్టేట్ అవార్డుని కూడా అందుకున్నాను.

"అటు వంటి నేను రిటైరై ఇంట్లో కూర్చొని, ఒక ఆడపిల్లచేత మోసగింపబడ్డానని చెప్పు కోవటం ఎంత సిగ్గు చేటు?"

ఇక ఆలోచించే శక్తి నాకు లేదు. తల దిమ్ముగా ఉంది. ఆ అమ్మాయి నవ్వు ముఖం నన్ను వెక్కిరిస్తూ ఉండగా, నా కళ్లు గిర్రున తిరిగాయి. ప్రక్కనే ఉన్న బెడ్ మీద అనాలోచితంగా వాలి పోయాను.

## సభ కేలినవా రేతెంచిన వేళన ...

*పాలనా వర్గాలు చేతబూనిన పెద్దల్లో ఎవరన్నా మీటిం గడితేనూ ఏ మీటింగ్‌లోనన్నా పాల్గొంటేనూ ఆషామాషీనా? లారీల్లో, రోడ్డు రవాణా వారి సర్వీసుల్లో జనులు మోసుకురాబడతారు గదా! [కొండకచో తిరుగు ప్రయాణం పాట్లు పుట్టించిన వాడికే తెలియా లంటారు!]*

*అలాం టిలాంటి వారు గాదు ఏకంగా మాన్యశ్రీ ప్రధానిగారే హాజరైన గోష్ఠి అది. ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో 'అందరికీ విద్య' గురించి వేడి వేడి [కాదు కాదు చల చల్లని చలికాలం కదా!] మీటిం గది.*

*సాక్షాత్తు ప్రధా నంతటి వారు వేంచేసి రోజంతా పాల్గొంటున్నారన్నా సభా స్థలం ముప్పాతికవంతు ఖాళీగానే ఉండి వక్తలను వెక్కిరించిందట! పరిస్థితి ప్రధాని వారి కార్యాలయ సిబ్బందికి దుర్భరంగా తోచి, వివిధ శాఖాధిపతులకు 'మీ మీ కార్యాలయ సిబ్బందిని విజ్ఞాన్ భవన్‌కు తరలించుకురండి!' [పరువు నష్టం అంటారా?] అంటూ తాఖీదులు పంపారు. ఆహ్వానా లందుతూనే ఢిల్లీ సచివాలయాధికారులు తమ తమ శాఖల్లోని ఉద్యోగు లందరితో [ప్యూనులతో సహా] విజ్ఞాన్‌భవన్‌లో 'జీ హుజూర్'గా హాజరైపోయారు. దాంతో పొద్దుటిపూట వెలాతెలాబోయిన సభాస్థలి మధ్యాహ్నానికి కిటకిటలాడింది.*

*ఆహా అనుకోబోతుండగానే రహస్యం కాస్తా బట్టబయలైపోయింది.*

*పాపం మన ప్రభుత్వోద్యోగులలో కొందరికి పరన నచ్చలేదో, మరి బాధించిందో గానీ, 'మమ్మల్ని కనీసం కప్పు టీ అన్నా లేకుండా ఈడ్చుకు వచ్చా'రంటూ గాట్టిగా గొణిగారట! ఊఁ ఇం కేం రహస్యం!*